

రైతన్నా .. జాగ్రత్తన్నా...
పంటకు ఆశించే చీడ పీడల నివారణకు రైతులు క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తుంటారు. ఈ తరుణంలో రసాయనాల విషయంలో జాగ్రత్తలు పాటించడం అవసరం. -8లో



న్యాయ వ్యవస్థ గౌరవాన్ని నిలబెడదాం
న్యాయ వ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాయచోటి ఐదో న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.400
రెండోరకం	రూ.240	రూ.356



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 124 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	590	590
సీబీ	-	-




మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 76.680 కిలోలు

వైద్య విద్యకు చంద్ర గ్రహణం

- విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లిన కూటమి ప్రభుత్వం
- ప్రారంభానికి ఏర్పాట్లు జరిగినప్పటికీ ఉద్దేశపూర్వకంగా మోకాలడ్డు
- 750 సీట్లు కోల్పోయిన విద్యార్థులు
- వచ్చే ఏడాది వరకు వేచి చూడాల్సిన పరిస్థితి





మదనపల్లె మండలం ఆరోగ్యవరం సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల

మదనపల్లె: రాష్ట్రంలో వైద్య విద్యకు చంద్ర గ్రహణం పట్టింది. స్థానికంగా వైద్య విద్యను అభ్యసించి, పేదలకు సేవ చేయాలనుకున్న వేలాది మంది విద్యార్థుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్ల చల్లింది. ఈ విద్యా సంవత్సరమే ప్రారంభించేందుకు అవకాశాలున్నప్పటికీ ఉద్దేశపూర్వకంగానే నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నుంచి అనుమతులు రాకుండా మోకాలడ్డింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తలపెట్టిన 17 కొత్త ప్రభుత్వ వైద్యకళాశాలలను గుజరాత్ పీపీపీ మోడల్‌లో ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఈ ఏడాది ప్రారంభం కావాల్సిన మదనపల్లె వైద్య కళాశాలకు కుట్రపూరితంగా ప్రభుత్వమే పొగబెట్టింది. దీంతో 2024–25 విద్యాసంవత్సరానికి మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, ఆదోని, పాడేరు ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 150 చొప్పున మొత్తం 750 ఎంబీబీఎస్ సీట్లను విద్యార్థులు కోల్పోయారు. బోధనాసుపత్రులకు వచ్చే రోగులు నాణ్యమైన వైద్యసేవలు పొందలేకపోయారు.

జిల్లాకు ఒకటి చొప్పున..

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేసి జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామని 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ హామీ ఇచ్చింది. అన్ని ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయడంతో పాటు మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలను మెరుగుపరుస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తూ రాష్ట్ర వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.8,480 కోట్లతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టారు.

జూన్‌లో ఎన్ఎంసీ బృందం పరిశీలన..

ఈ ఏడాది జూన్ 24వ తేదీన నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం మెడికల్ కాలేజీని, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించింది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలపై నివేదికను ప్రభుత్వానికి పంపారు. తర్వాత కొద్దిపాటి మార్పులను సూచిస్తూ, రాష్ట్రప్రభుత్వం నుంచి వివరణ కోరింది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తరగతులు ప్రారంభమయ్యేలోపు వసతులు కల్పించాల్సిందిగా కోరింది. అయితే కూటమి ప్రభుత్వం ఈ విషయమై శ్రద్ధ కనబరచకపోగా, నిర్లక్ష్యం ప్రదర్శించింది. దీంతో ఈ ఏడాది మెడికల్ కాలేజీని ప్రారంభించకపోవడంతో దాదాపు 150 సీట్లు విద్యార్థులు నష్టపోవాల్సి వచ్చింది.

మదనపల్లెలో 70 శాతం పనులు పూర్తి..

రాజంపేట పార్లమెంటరీ పరిధిలో మదనపల్లెలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి పేదలకు వైద్యవిద్యను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు, పడమటి నియోజకవర్గాలైన తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, పుంగనూరు ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించే దిశగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. మదనపల్లె మండలం ఆరోగ్యవరం సమీపంలో 95 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్లతో నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండేళ్లుగా పనులు వేగంగా జరిగాయి. దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయి.



మెడికల్ కాలేజీ ప్రారంభానికి జిల్లా ఆస్పత్రిలో నిర్మించిన అదనపు గదులు

అలాగే 82 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, డాక్టర్లను గత ప్రభుత్వం నియమించింది. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిని సైతం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది. జీజీహెచ్‌లో 400 బెడ్లను సిద్ధం చేసింది. ఆరోగ్యవరంలో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయ్యేవరకు తాత్కాలికంగా ఇక్కడ తరగతులు నిర్వహించేందుకు అదనపు గదుల నిర్మాణం చేపట్టింది. 2024–25 విద్యాసంవత్సరానికి ఎలాగైనా ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభించాలని వైఎస్సార్‌సీపీ సర్కార్ అన్నిరకాల చర్యలు తీసుకుంది. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితి తారుమారైంది. మెడికల్ కళాశాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనులు మందగించాయి.

ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం



దాదాపు 75శాతం పనులు పూర్తిచేసుకున్న మదనపల్లె మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభించేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం కావాలనే మోకాలడ్డింది. మెడికల్ కాలేజీ ప్రారంభిస్తే ఆ ఘనత వైఎస్సార్‌సీపీకి వెళుతుందని, ఏడాది తర్వాత తామే తీసుకువచ్చామని చెప్పేందుకే ఉద్దేశపూర్వకంగా అనుమతుల నిరాకరణ జరిగి ఉంటుంది. దీనికి రాజకీయ కారణాలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. స్థానికంగా వైద్యవిద్యను అభ్యసించాలనుకుని, నీట్ ప్రవేశపరీక్షలో మంచి ర్యాంకు సాధించి ఆశగా ఎదురుచూస్తున్న విద్యార్థులకు టీడీపీ ప్రభుత్వం నిరాశను మిగిల్చింది.

– నిసార్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మదనపల్లె

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం



చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం కానుంది. వైద్య కళాశాల నిర్మాణంతో నిరుపేద పిల్లలకు వైద్య విద్యలో అవకాశం లభిస్తుందని ఆశించాము. కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రంలో నిర్మాణం పూర్తి చేసుకున్న కళాశాలలకు అనుమతులతో పాటు సీట్లను కేటాయిస్తామని ముందుకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వైద్యాన్ని కూడా ప్రైవేటు సంస్థకు అప్పగించి సొమ్ము చేసుకోవాలని చూస్తోంది. కొత్త కళాశాలలకు అనుమతులు వస్తే కొన్ని వందల మంది పేద విద్యార్థులకు మేలు జరిగి ఉండేది.

– కిషోర్ కుమార్‌రెడ్డి, రెడ్డిమళ్లవారిపల్లె, సంబేపల్లె మండలం

17 నుంచి స్వభావ్ స్వచ్ఛత.. సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమాలు

- జిల్లా వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటాలి
- జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి: స్వభావ్ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమాలను ఈనెల 17వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి స్వచ్ఛతాహి సేవా అంశంలో భాగంగా 2024 స్వభావ్ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమాలకు సంబంధించి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను పంచాయతీలు, గ్రామాలు, పట్టణాలలో విస్తృతంగా అమలు చేసి పారిశుద్ధ్యం నిర్వహణ మెరుగుపరచాలన్నారు. అక్టోబర్ 2న మహాత్మునికి నివాళిగా స్వచ్ఛ భారత్ దివస్‌గా పరిగణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ఈనెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమాలలో ప్రజలను విరివిగా భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ పచ్చదనం పెంపులో భాగంగా కార్తీక వన మహోత్సవం వరకు జిల్లా వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డ్వామా, పంచాయతీ, జిల్లా పరిషత్ డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్, మున్సిపల్, టూరిజం, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇ- పంట రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలి

సిద్దవటం: రైతు సేవా కేంద్రం సహాయకులు ఇ- పంట రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎ. నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిద్దవటం మండలంలోని టక్కోలు రైతుసేవా కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దస్త్రాలను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇ-పంట నమోదు ప్రక్రియను ఈనెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని తెలిపారు. అందుకోసం రైతులను అప్రమత్తం చేయాలన్నారు. ఈనెల 24 వతేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సహాయకులు వంశీ, రైతులు పాల్గొన్నారు.



టక్కోలులో వేరు శనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

చక్రాలమడుగు ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం!



ఆక్రమణలతో మారిన చక్రాలమడుగు స్వరూపం

సాక్షి ఎఫెక్ట్..

- మడుగు హద్దుల గుర్తింపునకు చర్యలు
- సాక్షి కథనంపై కదిలిన కడప ఇరిగేషన్ శాఖ

రాజంపేట: బుడమేరు.. తరహాలో ఉన్న చక్రాలమడుగు ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఇరిగేషన్‌శాఖ సన్నద్ధమవుతోంది. ఈనెల 10న అక్కడ బుడమేరు..ఇక్కడ చక్రాలమడుగు అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఇరిగేషన్ ఉప కార్యనిర్వాహక ఇంజినీరు , సబ్‌డివిజన్‌లో కదలిక వచ్చింది. చక్రాలమడుగు హద్దులు, పూర్తి స్థాయి విస్తీర్ణం ఎంత ఉందనేది తేల్చాలని రాజంపేట రెవెన్యూ శాఖను ఇరిగేషన్ శాఖ కోరింది. ఈమేరకు వారికి లేఖ కూడా రాసింది. హద్దులు గుర్తించిన వెంటనే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని ఆ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

గతంలో సర్వేలు.. కంటితుడుపునకే..

మడుగును సర్వే చేయడం వల్ల ఆక్రమణల బండారం బట్టబయలవుతుంది. గతంలో కలెక్టర్ శశిభూషణ్ హయాంలో అప్పటి ఆర్డీఓ పద్మజ రెవెన్యూ శాఖ మడుగు ఆక్రమణలపై సర్వే నిర్వహించిన విషయం విదితమే. ఆ తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చాక దర్జాగా ఆక్రమణలు జరిగిపోయాయి. నిర్మాణాలు కూడా వెలిశాయి. అయినప్పటికి జిల్లా కలెక్టర్ నుంచి డివిజన్, మండల స్థాయి వరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు మళ్లీ సర్వే చేసేందుకు ఇరిగేషన్ శాఖ సన్నద్ధం కావడం విశేషం.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై దృష్టి సారించాలి

జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు



రాయచోటి: పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజల మధ్య ఉంటూ నేరాలను నియంత్రిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో రాయచోటి సబ్ డివిజన్ పోలీసు అధికారులతో ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. విజిబుల్ పోలీసింగ్‌పై, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం(పీజీఆర్‌ఎస్)లో వచ్చే ఫిర్యాదులు ప్రాధాన్యతనిస్తూ చట్ట పరిధిలో నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. రాయచోటి పట్టణం, గ్రామాల్లో స్కూళ్లు, కళాశాలలు, ముఖ్యమైన కూడళ్లు, పట్టణ శివారులు, నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారులలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. బ్లాక్ పాయింట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, భూతగాదాలు, గంజాయి, అక్రమ మద్యం మొదలైనవి జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోక్సో కేసులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. జిల్లా కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలన్నారు.

నేడు జాతీయ మెగా లోక్ అదాలత్

సెప్టెంబర్ 14న జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ ఇరు పక్షాల వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. నేర సమీక్ష సమావేశంలో రాయచోటి ఇన్‌చార్జి డీఎస్పీ సుధాకర్, రాయచోటి సబ్ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టరేట్ దగ్ధం ఘటనలో సీఐడీ విచారణ

మదనపల్లె: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్ అగ్నిప్రమాద ఘటనకు సంబంధించి గురువారం సీఐడీ అధికారులు మదనపల్లె సబ్ కలెక్టరేట్, మండల తహసీల్దార్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. తిరుపతి సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ నేతృత్వంలో నలుగురు ఎస్ఐలు బృందంగా ఏర్పడి సబ్ కలెక్టరేట్‌లో ఘటన జరిగిన గదిని, అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. పెద్దమండ్యం మండలం ముసలికుంటకు చెందిన రైతు ఫ్రీహోల్డ్ దరఖాస్తుపై విచారణ నిర్వహించారు. మదనపల్లె మండలంలోని 4 రెవెన్యూ గ్రామాల్లోని నలుగురు రైతులను పిలిచి ఫ్రీహోల్డ్‌కు సంబంధించి వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. సుమారు రెండుగంటలకు పైగా తహసీల్దార్ కార్యాలయంలో సీఐడీ అధికారులు విచారణ కొనసాగించారు. సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసుకు సంబంధించి సీఐడీ విచారణ సమగ్రంగా జరుపుతున్నామని, నాగపూర్ ఎఫ్ఎస్ఎల్ఆర్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని, తర్వాతే కేసుకు సంబంధించి పురోగతి ఉంటుందని డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు.



మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలోకి వెళుతున్న సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్, సిబ్బంది

యోగాతో ఆరోగ్యం



శాంతికపోతం ఎగుర వేసి పోటీలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

- పాఠశాల నుంచే యోగా అభ్యసించాలి
- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్
- ఉల్లాసంగా ప్రారంభమైన జాతీయ స్థాయి యోగా మీట్

మదనపల్లె సిటీ: ఒత్తిడి నిండిన జీవితాలకు యోగా అత్యవసరమని గుర్తించి పాఠశాల స్థాయి నుంచే యోగా అభ్యసించేలా చేయాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం 14వ జాతీయ స్థాయి యోగా మీట్–2024–25ను శాంతి కపోతం ఎగుర వేసి ప్రారంభించారు. పోటీలకు భోపాల్, ఛండీగఢ్, హైదరాబాద్, జైపూర్, లక్నో, పాట్నా, పూణే, షిల్లాంగ్ నవోదయ విద్యాలయాల రీజియన్ల క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. యోగా పోటీలు ఉల్లాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఒత్తిడి లేని జీవితానికి యోగా చక్కటి పరిష్కారమార్గమన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగా అందరి జీవితంలో భాగం కావాలని, అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం నిర్మించగలమన్నారు. రోజూ యోగా సాధన తప్పక చేయాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. హైదరాబాద్ రీజియన్ ఆఫీసు అసిస్టెంట్ కమిషనర్ సి.రామకృష్ణ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ వేలాయుధన్, బెంగళూరు రూరల్ ప్రిన్సిపాల్ చక్రవర్తి, సత్యసాయి జిల్లా నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు, పి.జగదీష్‌కుమార్, పూర్వపు విద్యార్థులు, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్చ్‌ఫాస్ట్ రీజియన్లకు బహుమతులు

జాతీయ స్థాయి యోగామీట్‌లో పాల్గొని మార్చ్ ఫాస్ట్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి పాట్నా రీజియన్, రెండవ బహుమతి హైదరాబాద్ రీజియన్, మూడవ బహుమతి పూణే రీజియన్ గెలుపొందాయి.

ఆకట్టుకున్న యోగాసనాలు

యోగా మీట్‌లో విద్యార్థులు చేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వివిధ భంగిమల్లో యోగాసనాలు చేశారు.

న్యూస్‌రీల్

కడప నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: పౌర్ణమిని పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో నుంచి ఈనెల 17వ తేదీన సూపర్ లగ్జరీ, ఇంద్ర బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ ఢిల్లీశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 6001 నంబరుగల సూపర్ లగ్జరీ బస్సులో పెద్దలకు రూ. 1072, పిల్లలకు రూ. 580 చార్జీగా ఉందన్నారు. 6002 నంబరుగల ఇంద్ర సర్వీసులో పెద్దలకు రూ. 1605, పిల్లలకు రూ. 850 ఛార్జిగా ఉంటుందన్నారు. ఈ బస్సుల్లో ఆన్‌లైన్ ద్వారా లేదా కడపలోని ఆర్టీసీ బస్టాండులోగల రిజర్వేషన్ కౌంటర్ ద్వారా కూడా టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జీఏపీ సర్టిఫికెట్ పొందేందుకు కృషి చేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

రాయచోటి: రైతులకు సంబంధించి జీఏపీ సర్టిఫికెట్ పొందేందుకు జిల్లాలో ఎన్నికైన ఎనిమిది ఎఫ్‌పీఓలు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. గురువారం రాయచోటి పట్టణంలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జీఏపీ పొలంబడిపై అంతర్గత తనిఖీదారులకు, క్యూఎంఎస్ మేనేజర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో 28 మండలాల్లో జీఏపీ పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో 23 మండలాలు వేరుశనగ, 3 మండలాలు వరి, 2 మండలాలు సజ్జ పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఎన్నుకోబడిన ఎనిమిది ఎఫ్‌పీఓలు తమ పరిధిలోని రైతులకు భూమి జీఏపీ సర్టిఫికెట్ పొందేందుకు కృషి చేయాలన్నారు. దీనివలన రైతులు తమ ఉత్పత్తులకు అధిక ధరలను పొందడమే కాకుండా ఎఫ్‌పీఓలకు కూడా లబ్ధి చేకూరుతుందన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా నందలూరు విద్యార్థిని



ఆరెం అనిల

నందలూరు: జాతీయ స్థాయిలో జరిగే కేంద్రీయ విద్యాలయాల క్రికెట్ పోటీలలో పాల్గొనే జట్టులో మన రాష్ట్రం నుంచి నందలూరుకు చెందిన విద్యార్థిని ఆరెం అనిల కెప్టెన్‌గా ఎంపికైంది. ఈనెల 22వ తేదీన రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్‌లో జాతీయ స్థాయిలో అండర్–17 విభాగంలో కేంద్రీయ విద్యాలయాల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలలో జాతీయ స్థాయిలో ఏడు జట్లు మాత్రమే పాల్గొంటాయి. ఈ జట్లలో మన రాష్ట్రం నుంచి మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆరెం రామచంద్రయ్య, సుమలత దంపతుల కుమార్తె అనిల (రాజంపేట కేంద్రీయ విద్యాలయంలో పదోతరగతి) కెప్టెన్‌గా ఎంపికైంది. నందలూరు క్రికెట్ సబ్ సెంటర్‌లో గత నాలుగు సంవత్సరాలుగా శిక్షణ పొందుతోంది. జాతీయస్థాయిలో క్రికెట్ జట్టుకు ఎంపిక కావడంపై కోచ్‌లు గయాజ్, ఫైరోజ్ ఖాన్‌లోడి, శివకోటిలకు, రాజంపేట కేంద్రీయ విద్యాలయం పీఈటీ రాహుల్ కుమార్ పచ్చాసియా, ప్రిన్సిపాల్ మీరాజ్ కుమార్, శ్రీవాస్తవ్‌లకు అనిల కృతజ్ఞతలు తెలిపింది.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపికలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రైఫిల్ షూటింగ్ క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరులోని జార్జ్ కారొనేషన్ క్లబ్‌లో గురువారం స్కూల్‌గేమ్స్ ఎంపికలు జరిగాయి. అండర్–19 బాలబాలికల విభాగానికి సంబంధించి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, రైఫిల్ షూటింగ్, యోగా ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను త్వరలో జరుగునున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని జార్జ్‌కారొనేషన్ క్లబ్ కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శారద, సంయుక్త కార్యదర్శి విజయప్రసాద్‌రెడ్డి, బ్యాడ్మింటన్ అంతర్జాతీయ అంపైర్ జిలాని బాషా ఆకాంక్షించారు. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు అరుణకుమారి, రాఘవ, చంద్రావతి, హసీనా తదితరులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

30లోపు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించాలి

మదనపల్లె సిటీ : జిల్లా స్కూల్స్ గేమ్స్ అండర్-14, 17 బాల బాలికల జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 30వతేదీ లోపు తప్పకుండా నిర్వహించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. డీఈఓ ఆదేశాల మేరకు మండల స్థాయిలో 15వతేదీ లోపు, నియోజకవర్గ స్థాయి పోటీలు 20వతేదీలోపు నిర్వహించాలని సూచించారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యయత్నానికి పాల్పడిన అరుణ

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రామసముద్రం మండలంలో జరిగింది. చెంబకూరు ఎగువ హరిజనవాడకు చెందిన మణి భార్య అరుణ(28) కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడింది. మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రికి తరలించారు.

210 ప్యాకెట్ల మద్యం పట్టివేత

బి.కొత్తకోట : కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లు తీసుకువస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ కే.రాజారెడ్డి తెలిపారు. గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా.. బి.కొత్తకోట పంచాయతీ తాకాటంవారిపల్లె సమీపంలో వెంకటరమణ ఆయన కుమారుడు వివేకానంద కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద 210 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని వెంకటరమణను అరెస్టు చేయగా, ఆయన కుమారుడు పరారయ్యాడని తెలిపారు. గట్టు పంచాయతీ పత్రవారిపల్లె వద్ద మద్యం విక్రయిస్తున్న గోపాల్‌ను అరెస్ట్ చేసి 52 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

నిందితుడి అరెస్టు

మదనపల్లె: హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని పెంచుపాడు పంచాయతీ పనసమానుకుంటకు చెందిన పి.నారాయణ(60)పై అదే గ్రామానికి చెందిన అతడి బంధువు పి.చెన్నకేశవులు(35)కు భూ వివాదాలున్నాయి. ఈ నెల 4వ తేదీ రాత్రి నారాయణపై కొడవలి, కర్రలతో చెన్నకేశవులు దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు.

రైతన్నా.. జాగ్రత్తన్నా...

- ఎరువుల వాడకంలో అధికారుల సూచనలు ముఖ్యం
- పురుగు మందు పిచికారీలో నిర్లక్ష్యంచేస్తే ప్రాణాలకే ముప్పు

పంటకు చీడ పీడల బెడద తగ్గించేందుకు పురుగుల మందు పిచికారీ తప్పనిసరి. రైతు తమకు తోచిన దుకాణ దారు వద్ద ఏదో పురుగు మందు కొనుగోలు చేసి పంటను రక్షించుకునేందుకు పిచికారీ చేస్తున్నారు. అయితే మందుల కొనుగోలు విషయంలోనూ.. పిచికారీ విషయంలోనూ జాగ్రత్తలు పాటించకపోతే అటు పంటకు.. ఇటు రైతుకు ప్రమాదం తప్పదని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెగుళ్ల సమాచారం అధికారుల దృష్టికి తీసుకువచ్చి వారి సూచనలు పాటిస్తే ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చని చెబుతున్నారు.

కడప అగ్రికల్చర్ : కడపలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. పెన్నా, కుందూ నది పరివాహక ప్రాంతాలతో పాటు ప్రాజెక్టులు, కేసీ కెనాల్, బోర్ల కింద వరి పంట విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇటీవల వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల దృష్ట్యా అక్కడక్కడా సాగు చేసిన వరి, ఆరుతడి పంటలకు తెగుళ్ల సోకడంతో రైతులు పురుగు మందులు పిచికారీకి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. నకిలీ పురుగు మందుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, చీడపీడలు, తెగుళ్ల నియంత్రణకు వినియోగించే పురుగు మందు డబ్బాపై వజ్రాకారంలో అత్యంత విష పూరితమైతే నీలం, తక్కువ విషపూరితమైతే ఆకుపచ్చ గుర్తులు ఉంటాయని వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే పురుగు మందులు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి వారి సూచన మేరకు మందులు వాడాలని హెచ్చరిస్తున్నారు.

రసాయనాలతో జాగ్రత్త...

పంటకు ఆశించే చీడ పీడల నివారణకు రైతులు క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తుంటారు. ఈ తరుణంలో రసాయనాలతో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. గుండె జబ్బులు, కళ్లు తిరగడం, వాంతులు, క్యాన్సర్, నరాల బలహీనత వంటి సమస్యలకు లోనయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పిచికారీ చేసే వ్యక్తులకేగాక మందుల వాడకం అవశేషాలతో పండించే పంట ఉత్పత్తులపై చాలాకాలంగా ఉండి వినియోగించే ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి లోనయ్యే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. విచక్షణా రహితంగా పురుగు మందులు వినియోగిస్తే కీటకాలు వ్యాధి నిరోధక శక్తిని పొందడంతో పంటకు నష్టం వాటిల్లుతుంది. ప్రకృతి వ్యవసాయం చేస్తే మనుషులేగాక నేల కూడా ఆరోగ్యంగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడమేగాక, ఆరోగ్యకర పంట ఉత్పత్తులు పొందవచ్చు. పశువుల పేడ, వేపాకు కషాయం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మి కంపోస్టు వినియోగంచడంతో భూసారం పెరుగుతుంది,


వరి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పిచికారీ విషయంలో జాగ్రత్తలు అవసరం

- మందులు పిచికారీ చేసే సమయంలో శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి. ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజు వేసుకోవాలి. పిచికారీ సమయంలో భోజనం చేయడం, నీరు తాగడం, సిగిరెట్, బీడీ కాల్చడం వంటి పనులు చేయరాదు.
- పురుగు మందులు కలిపేటప్పుడు చేతులతో కాకుండా కర్రలతో కలపడం శ్రేయస్కరం. ఆహార పదార్థాలతో కలిసి కీటక నాశన మందులను రవాణా చేయరాదు.
- ఇళ్లలో పురుగు మందు డబ్బాలను పిల్లలకు అందుకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అంతేగాక వాటికంటూ ప్రత్యేక స్థలాన్ని కేటాయించి భద్రపరచుకోవాలి.
- పురగుమందుల డబ్బాలపై రంగు ముద్రలు పరిశీలించాలి, గాలి వీచే దశలోనే మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- పురుగుమందు పిచికారీ యంత్రాలకు సంబంధించిన నాజిల్స్‌ను శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదడం అత్యంత ప్రమాదకరం. ప్రమాదవశాత్తూ మందు కళ్లలో పడితే వెంటనే మంచి నీటితో శుభ్రంచేసుకోవాలి.
- కీటకనాశక మందుల పిచికారీ తర్వాత ఖాళీ డబ్బాలను గొయ్యి తీసి పూడ్చిపెట్టాలి, ఇతర అవసరాలకు వాడొద్దు. - ప్రమాదవశాత్తూ విష ప్రభావానికి గురైతే ప్రథమ చికిత్స అందించి తక్షణమే ఆసుపత్రికి తరలించాలి. వాడిన మందు వివరాలు వైద్యులకు తెలియజేయాలి.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్ప్రేయర్ బయట, లోపల శుభ్ర చేసి ఆరబెట్టుకోవాలి. తిరిగి వాడుకునే ముందు అయిల్ పట్టించుకోవాలి.

శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించాలి



పంట పొలాల్లో చీడ, పీడల నివారణకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. నాణ్యమైన ఎరువు, పురుగుల మందులను మాత్రమే వాడుకోవాలి. మందు పిచికారీ చేసేటప్పుడు తప్పని సరిగా రక్షణ దుస్తులు, ముఖానికి మాస్కు చేతులకు గ్లౌజు వేసుకుని అన్ని జాగ్రత్తలను పాటిస్తూ పిచికారీ చేసుకోవాలి.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయాధికారి.

గోశాలకు పశువుల తరలింపు


మాట్లాడుతున్న జె.లలితమ్మ

మదనపల్లె : నిబంధనలకు విరుద్ధంగా కబేళాకు పశువులను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. తట్టివారిపల్లె గ్రామస్తులు సమాచారం అందించడంతో సిబ్బందితో కలిసి తనిఖీలు చేశామన్నారు. అనంతపురం నుంచి తమిళనాడుకు లారీలో పశువులను తీసుకెళ్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీ డ్రైవర్, క్లీనర్లను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశామన్నారు. అందులో 46 పశువులను బెంగళూరు రోడ్డులోని గోశాలకు తరలించామన్నారు.

నకిలీ బంగారంతో బురిడీ

- జేసీబీతో తవ్వుతుంటే దొరికిందని మూడు కిలోల నకిలీ బంగారం అప్పగింత
- వ్యాపారి వద్ద రూ.7.84 వేల నగదు, మూడు ఐఫోన్లు తీసుకుని దగా
- ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన రాజంపేట అర్బన్ పోలీసులు

రాజంపేట : జేసీబీతో తవ్వుతుంటే దొరికిందంటూ.. నకిలీ బంగారం చూపి ఓ వ్యాపారిని నిలువునా దగా చేసిన వైనం గురువారం వెలుగుచూసింది. అర్బన్ సీఐ యల్లమరాజు వివరాల మేరకు.. తెలంగాణా రాష్ట్రంలోని బుర్రకాయలగూడేనికి చెందిన తుమ్మల శ్రీధర్‌ను అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం షికారుపాలెం వాసులు గోవిందగంగరాజు, రాణా అరవింద్, పోమారు అనుపతి కలిసి తమ మాయ మాటలతో బురిడీ కొట్టించారు. తమది కేరళ అని..తాను జేసీబీతో మట్టి తవ్వుతుంటే మూడు కిలోల బంగారు లభ్యమైందని.. రూ.10 లక్షలు ఇస్తే ఇచ్చేస్తాం.. రాజంపేటకు రమ్మని.. వ్యాపారి శ్రీధర్‌కు ఫోన్ చేశారు. వాట్సాప్ వీడియో కాల్ ద్వారా నకిలీ బంగారం చూపించారు. ఇది నమ్మిన శ్రీధర్ వారి వద్దకు వచ్చి మూడు కిలోల నకిలీ బంగారు(పూసల దండ)తీసుకున్నారు. వారు అడిగిన మేరకు.. రూ.5,60,000 నగదు, రూ.2,24,700 విలువ చేసే మూడు ఐఫోన్-15లు తీసి ఇచ్చారు. అనంతరం నకిలీ బంగారం అని గమనించిన వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు రాజంపేట డీఎస్పీ పర్యవేక్షణలో రాజంపేట సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది ఎంవో క్రిమినల్స్ ఆధారంగా షికారుపాలేనికి చెందిన ముగ్గురిని గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,45,000 నగదు, రూ.2,24,700 విలువ చేసే ఐఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ యల్లమరాజు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోరాదని సూచించారు.

ప్రెస్ నోట్ ఇచ్చిందెవరు.. సస్పెండ్ చేస్తా

– సచివాలయసిబ్బందిపై ఎంపీడీఓ ఆగ్రహం

రాజంపేట : 'ఎవరు.. ప్రెస్‌నోట్ ఇచ్చింది.. నేను ఫోన్ చేస్తే మాట్లాడరు. సస్పెండ్ చేస్తా, స్టేషన్‌లో వేయిస్తా' అంటూ ఎంపీడీఓ రాజకుమారి ఆవేశంతో ఊగిపోయారు. వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు శాండ్ సేల్ గ్రూప్‌లో మేసేజ్ చూడండి అంటూ సిబ్బందికి చీవాట్లు పెట్టింది. ఇసుక బుకింగ్ తాము చేయలేమని చేతులెత్తేసిన సచివాలయ సిబ్బందిపై పత్రికల్లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆమె ఇలా స్పందించారు. ఈ వ్యవహారమంతా ఆడియో కాల్ ద్వారా లీక్ కావడంతో సచివాలయ ఉద్యోగులపై ఎంపీడీఓ వ్యవహారశైలిపై సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. ల్యాండ్ సేల్ బుకింగ్ అంశంపై సచివాలయ సిబ్బంది చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇసుక బుకింగ్ పర్యవేక్షణ ఎంపీడీఓ, తహసీల్దారుకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్ ఎస్.బాషా గాయపడిన పవన్‌కుమార్‌రెడ్డి

పీలేరు రూరల్ : ఆటో–ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన స్థానిక తిరుపతి రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వివరాల మేరకు.. కేవీపల్లె మండలం మద్దివాండ్లపల్లె పంచాయతీ ఒంటిల్లుకు చెందిన పవన్‌కుమార్‌రెడ్డి, పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన టి.విశాల్ ద్విచక్రవాహనంలో తిరుపతి వైపు వెళ్తున్నారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన డ్రైవర్ ఎస్.బాషా ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సాయంతో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ ఎస్. బాషాను, పవన్‌కుమార్‌రెడ్డిని తిరుపతికి తరలిస్తుండగా ఎస్.బాషా మార్గం మధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

ఆడిటర్ల సమస్యలను పరిష్కరించాలి

– స్వంత భవన ఏర్పాటుకు స్థలం కేటాయించాలి
– ఏపీటీపీ సీఏ రాష్ట్ర ముఖ్య సలహాదారు షరీఫ్‌ఖాన్


మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెన్సీ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పఠాన్ షరీఫ్ ఖాన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో ఆడిటర్స్, టాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెన్సీ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెన్సీ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పఠాన్ షరీఫ్ ఖాన్ కోరారు. గురువారం కడపలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ అసోసియేషన్ భవన నిర్మాణానికి జిల్లాల్లో ఐదు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి జయకృష్ణ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా వృత్తి సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. అందుకే అవగాహన సదస్సుల ద్వారా సందేహాలు నివృత్తి అవుతాయని వివరించారు.

నూతన కమిటీ : అనంతరం వైఎస్సార్ అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పోసా మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా గండికోట శివకుమార్, కార్యదర్శిగా జయకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా వడ్డీ నాగరాజు, అష్రఫ్ అలీఖాన్, పఠాన్ తౌహీద్ ఖాన్, కోశాధికారిగా శ్రీనివాసులు, ఈసీ మెంబర్స్ ఎన్నుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వరదరాజులు, చంద్రశేఖర్, శివకుమార్, గౌరవాధ్యక్షులు కుమార్, చంద్రమౌళి, శ్రీనివాసరావు, సత్యనారాయణ రాజు, ఆదినారాయణ రెడ్డి, ఆడిటర్స్, టాక్స్ ప్రాక్టీషనర్స్, లయన్ పఠాన్ మన్సూర్ అలీ ఖాన్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థ గౌరవాన్ని నిలబెడదాం


మాట్లాడుతున్న న్యాయమూర్తి డాక్టర్ శారద

రాయచోటి టౌన్ : భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయ వ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత న్యాయవాదులు, న్యాయమూర్తులపై ఉందని రాయచోటి జిల్లా ఐదో న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి అన్నారు. రాయచోటి కోర్టు ఛాంబర్‌లో బదిలీపై వెళ్తున్న రాయచోటి అడిషనల్ జ్యుడిషయల్ మెజిస్ట్రేట్ డాక్టర్ శారదకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర వ్యవస్థలు తప్పు చేస్తే వాటి తప్పులు సరిదిద్దే స్థానంలో న్యాయస్థానం ఉందని తెలిపారు. రాజ్యాంగం న్యాయవ్యవస్థకు ఉన్నత స్థానం కల్పించిందని, ప్రజలకు చట్టబద్ధ పాలన అందించడంతో ఇతర వ్యవస్థలు విఫలమవుతున్న సమయంలో న్యాయ వ్యవస్థ రాజ్యాంగం కల్పించించిన హక్కులను కాపాడే బాధ్యత తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి డాక్టర్ శారద, సీనియర్ సివిల్ జడ్జి ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసీఫా సుల్తానా, రాయచోటి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి డి.నాగముని, ట్రెజరర్ సిద్దయ్య, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు


ఫిట్స్ కారణంగా ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయపడిన లోకేష్

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అనపగుట్ట శ్రీవారి నగర్‌కు చెందిన లక్ష్మీదేవి(45) పొలం వద్దకు వెళ్లేందుకు చంద్రాకాలనీ వద్ద రోడ్డుపై నిల్చుని ఉండగా, అటువైపు నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. నీరుగట్టువారిపల్లెకు చెందిన చేనేత కార్మికుడు లోకేష్(32) తన భార్య లక్ష్మీ ప్రసన్నతో కలిసి ద్విచక్ర వాహనంలో పట్టణంలోకి వస్తుండగా కదిరి రోడ్డు వీరబ్రహ్మేంద్రస్వామి గుడి సమీపంలో అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. నిమ్మనపల్లె మండలం ఆరిపిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులు(50) ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలోని పిట్టావాండ్లపల్లె మలుపు వద్ద వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో బాధితులను గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా చేనేత కార్మికుడు లోకేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ముస్లింల ఆస్తులను అన్యాక్రాంతం కానివ్వం


శిబిరంలో మాట్లాడుతున్న సొసైటీ ప్రధాన కార్యదర్శి అఫ్తాబ్

రాయచోటి అర్బన్ : ముస్లింలకు చెందిన వక్ఫ్ బోర్డు ఆస్తులను పరాధీనం చేస్తే సహించబోమని సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి అఫ్తాబ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నాలుగు రోడ్ల కూడలిలోని జామియా మసీదు ఎదుట సంతకాల సేకరణ చేశారు. శిబిరంలో క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసి వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఫిర్యాదులను పంపారు. ఈ సందర్భంగా విలేకరులతో అఫ్తాబ్ మాట్లాడుతూ వక్ఫ్ చట్టానికి ఎలాంటి సవరణలు అవసరం లేదని, ఉన్న చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో మూడు రాష్ట్రాలలో జరుగనున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ పెద్దలు ఇలాంటి నల్ల చట్టాలను తెస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సహారా వెల్ఫేర్ సొసైటీ గౌరవ సలహాదారు నిజాంఖాన్, సభ్యుడు జిల్లాన్, సుఫియాన్, ఇమ్రాన్, హఫీజ్ ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వేలం పాట

వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించిన భక్తగణం స్వామిని గంగ ఒడికి చేర్చారు. ఐదు రోజులుగా స్వామి వద్ద ఉంచి లడ్డూలకు వేలంపాట నిర్వహించగా.. వేల రూపాయలు పలికింది. అనంతరం లడ్డూ దక్కించుకున్న వారిని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

చిన్నమండెం



మండలంలోని కొత్తపల్లి పంచాయతీ శ్రీనివాసపురంలో వినాయక ప్రతిమ వద్ద ఉంచిన లడ్డూకు వేలం పాట గురువారం నిర్వహించారు. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఓర్సు జయచంద్ర స్వామి లడ్డూను రూ.3 లక్షలకు పాడి దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు.

సంబేపల్లె



మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ గాండ్లపల్లె గ్రామంలో వినాయక ఉత్సవ కమిటీ ఆద్వర్యంలో లడ్డూ వేలం నిర్వహించారు. బొనే చిన్న రమణ రూ.41,500లకు లడ్డు దక్కించుకున్నారు. అనంతరం రమణ దంపతులకు ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డును అప్పగించి సన్మానించారు.

గుర్రంకొండ



మండలంలోని టి.రాచపల్లెలో నిర్వహించిన వినాయకస్వామి లడ్డూకు వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన టి.గోపాల్‌రెడ్డి రూ.1.60 లక్షలకు దక్కించుకొన్నారు. గత ఏడాది స్వామివారి లడ్డూను ఇదే వ్యక్తి రూ.1.20 లక్షలకు దక్కించుకున్నారు. నిర్వాహకులు ఆయనను మేళతాళాలతో ఊరేగింపుగా ఇంటి వద్దకు చేర్చారు.

పుల్లంపేట



అనంతంపల్లి పంచాయతీలోని జానకీపురం గ్రామంలో 12వ మహా గణపతి ఉత్సవాలలో వినాయకుడి వద్ద ఉన్న లడ్డూకు గురువారం వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన జంబు నరసింహులు, ఆయన భార్య జంబు సుభద్ర వేలం పాడి లడ్డును రూ.35 వేలకు దక్కించుకున్నారు. మహాగణపతి కమిటీ సభ్యులు వారిని సన్మానించారు.

లక్కిరెడ్డిపల్లె



మండలంలోని మునిరెడ్డిగారిపల్లిలో గణేష్ విగ్రహం వద్ద ఉన్న లడ్డూకు వేలంపాట నిర్వహించగా షేక్ మహబూబ్ బాషా రూ.67,100కు పాడి దక్కించుకున్నారు. అబ్బవరం ప్రవీణ్ కుమార్ రెడ్డి, సినీ హీరో భరత్ (సినీ హీరో) కమిటీ సభ్యులు లడ్డూను బాషాకు అందజేశారు. సోమవాండ్లపల్లిలో గణేష్ లడ్డూను వేలంపాటలో సోమల సుబ్బయ్య రూ.50 వేలకు దక్కించుకున్నాడు.

12 మంది జూదరుల అరెస్టు

ఓబులవారిపల్లె : మంగంపేట ఆర్‌ఆర్-5 పునరావాస లే అవుట్ సమీపంలోని ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్న పన్నెండు మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పి.మహేష్ తెలిపారు. వారి నుంచి రూ.1,66,300ల నగదు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం..



జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని సరస్వతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థుల బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వైఎస్సార్ జిల్లా గండికోట గ్రామానికి చెందిన 32 మంది విద్యార్థులను తీసుకుని సరస్వతి హైస్కూల్ బస్సు జమ్మలమడుగుకు బయలుదేరింది. మార్గమధ్యంలో వాహానం అదుపు తప్పింది. అయితే డ్రైవర్ బస్సును కుడి వైపునకు మళ్లించడంతో ప్రమాదం తప్పింది. పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏ ప్రమాదం జరగలేదని తెలిసి విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.